క్లుప్తంగా

ఆలయ జీర్ణోద్ధరణకు పూజలు



బాలాలయ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

చాపాడు : మండలంలోని చియ్యపాడు గ్రామంలో పురాతన దేవాలయమై లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం జీర్ణోద్ధరణ కోసం ఆదివారం బాలాలయ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారి విగ్రహాన్ని బాలాలయంలో ఏర్పాటు చేసి విశేష పూజలు చేపట్టారు. దేవదాయశాఖ మంజూరు చేసిన రూ.61లక్షల నిధులతో ఆలయ నిర్మాణం చేపడుతున్నామన్నారు. అక్టోబరు నుంచి నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టడం జరుగుతుందని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ఈఓ రమణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం



ఎంఈఓ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ప్రైవేటు పాఠశాలల అసోషియేషన్ నాయకులు

రాజుపాళెం : రాజుపాళెం మండలంలో ఎంఈఓగా పనిచేస్తున్న గడియారం వెంకటేశ్వర్లు ఎర్రగుంట్లకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సర్వజ్ఞ హైస్కూల్‌లో ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఆదివారం ఎంఈఓను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ మాట్లాడుతూ బదిలీ అందరికీ సర్వసాధారణమన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటశివారెడ్డి (బాబు), రాజారావు, పల్లేటి ప్రభాకరరెడ్డి, బాల సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంఘం సభ్యులు సమావేశమై పలు సమస్యలపై చర్చించారు.

ఉచిత వైద్య శిబిరం



ఈసీజీ పరీక్ష చేస్తున్న వైద్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గాంధీశెట్టి చెంచుమయ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆస్పత్రి గుండె వైద్య నిపుణుడు డాక్టర్ సత్యప్రసాద్, జీర్ణకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్థోపెడిక్ డాక్టర్ సోమేష్ మంజునాథ్, డాక్టర్ సుదేష్ణ, తదితర పది మంది వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఈసీజీ, 2డీఎకో, టీఎఫ్‌టీ, బీఎండీ, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షుడు గాజులపల్లె అభినయ్ మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి తల్లం సందీప్, మనోజ్ కుమార్, సందీప్, వంశీకృష్ణ, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

రచయిత బొమ్మిశెట్టికి సన్మానం



బొమ్మిశెట్టి రమేష్‌ను సత్కరిస్తున్న పత్రా సంఘం నాయకులు

మైదుకూరు : మైదుకూరుకు చెందిన వన్నూరమ్మ – ఎదురులేని పాలగత్తె పుస్తక రచయిత బొమ్మిశెట్టి రమేష్‌కు అనంతపురం పత్రా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం పట్టణంలోని రుద్రంపేట యాదవ కల్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. అనంతపురం పత్రా కులస్తుల సమ్మేళనం – భవిష్యత్తు కార్యాచరణపై నిర్వహించిన సమావేశంలో వన్నూరమ్మ చరిత్ర రాసిన రమేష్‌ను సంఘం నాయకులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో పత్రా సంఘం అధ్యక్షుడు పెద్దపోతు హనుమంత నాయుడు, సలహాదారుడు పెద్దపోతు ఆంజనేయులు, బ్రహ్మంగారిమఠం వైస్ ఎంపీపీ రాజశేఖర్ నాయుడు, ఎంబీసీ డైరెక్టర్ నాయిని రమేష్‌నాయుడు, జిల్లా అధ్యక్షుడు పత్రా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెల్త్ కార్డుల సర్వేని నిర్వహించకుంటే జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించడం దారుణమన్నారు.

గంగ ఒడికి గణనాథుడు



వివేకానంద కాలనీలో వినాయక గ్రామోత్సవంలో భక్తుల సందడి



నిమజ్జనానికి ఊరేగింపుగా వెళుతున్న కోదండరామాలయం గణనాథుడు

ప్రొద్దుటూరు కల్చరల్: మండలంలోని కొత్తపల్లె పంచాయతీ వివేకానంద కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద స్వామి వారి వస్తువులకు ఆదివారం వేలంపాట నిర్వహించారు. ఇక్కడ లడ్డూను రూ.1.21 లక్షలకు జి.శివకుమార్‌గౌడ్, డాలర్‌ను రూ.1.41లక్షలకు రామబోయిన వెంకటసుబ్బయ్య యాదవ్, నోట్ల కట్ల దండను రూ.2.52 లక్షలకు బాలయ్యయాదవ్, పెన్ను, పుస్తకాన్ని వరలక్ష్మి రూ1.40 లక్షలకు, కలశాన్ని రూ.1.20 లక్షలకు నరేష్‌యాదవ్ దక్కించుకున్నారు. వేలంపాటలో మొత్తం రూ.7.74 లక్షలు వచ్చినట్లు వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు చెప్పారు. అనంతరం వినాయకుడిని ట్రాక్టర్‌లో కొలువుంచి యువకులు రంగులు చల్లుకుంటూ, డ్యాన్స్ చేస్తూ నిమజ్జనానికి తరలించారు.

■ పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలను ఆదివారం ఉత్సవ కమిటీ ప్రతినిధులు నిమజ్జనానికి తరలించారు. ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి గణపతి విగ్రహాన్ని ట్రాక్టర్, లారీలలో కొలువుంచారు. జై బోలో గణేష్ మహారాజ్ అంటూ నిమజ్జనానికి తరలించారు. భక్తులకు అన్నదానం చేశారు. డప్పు వాయిద్యాల సందడి, బాణసంచా పేలుళ్ల మధ్య రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పార్వతీ పుత్రుడిని సాగనంపారు. కొందరు ఉత్సవ కమిటీల ప్రతినిధులు మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు.

వినాయకుడికి వైస్ చైర్మన్ పూజలు

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీ సరస్వతీ విద్యా మందిరంలో ఏర్పాటు చేసిన 33 అడుగుల వినాయకుడిని ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ వారు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వరికూటి ఓబుళరెడ్డి, పగిడాల దస్తగిరి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షలు పలికిన లడ్డు

వినాయక చవితి పండగ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ఆదివారం వేలంపాట నిర్వహించారు. మాడిశెట్టి వీరభాస్కర్ రూ.2లక్షలకు వేలం పాడి లడ్డూను దక్కించుకున్నారు. సాయంత్రం వినాయకుడిని బ్యాండ్ మేళాలు, డీజేలతో ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఉట్టి రమణమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నశెట్టిపల్లిలో రూ.1.05 లక్షలకు..

రాజుపాళెం : మండలంలోని చిన్నశెట్టిపల్లెలోని బావి కట్ట వద్ద ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలం వేయగా పీఎస్.లక్ష్మీ నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి రూ.1,05,000లకు దక్కించుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వద్ద ఉంచిన కలశం చెంబును ఎంబీ.నరసింహారెడ్డి రూ.31000కు, స్వామి వద్ద డాలర్‌ను పీఎస్.యుగంధర్‌రెడ్డి రూ.6600కు దక్కించుకున్నట్లు చెప్పారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనాలు

బద్వేలు అర్బన్ : వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలో ఏర్పాటు చేసిన పలు విగ్రహాలను 7వ రోజైన ఆదివారం కోలాహలంగా నిమజ్జనాలకు తరలించారు. పట్టణంలోని సిద్ధవటం రోడ్డు కోదండరామాలయం, రూపరాంపేట, లక్ష్మీపాలెం, బంకపాలెంలలో ఏర్పాటు చేసిన విగ్రహాలను మేళతాళాలు యువకుల కేరింతల నడుమ నిమజ్జనానికి తరలించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజన, విచిత్ర వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయా విగ్రహాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. యువకులు పెద్ద ఎత్తున బాణాసంచా పేలుస్తూ రంగులు చల్లుకుంటూ ఆనందంతో విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. బద్వేలు అర్బన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు అన్ని విగ్రహాల ఊరేగింపుల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిద్ధవటం రోడ్డులో రూ.1.40 లక్షలకు..

స్థానిక సిద్ధవటం రోడ్డులోని కోదండరామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నిర్వహించిన లడ్డు వేలంపాటలో బైరెడ్డివెంకటసుబ్బారెడ్డి రూ.1.40 లక్షలకు లడ్డును సొంతం చేసుకున్నారు. అలాగే కరెన్సీ నోట్ల దండను రాచంరెడ్డి చంద్రఓబుల్‌రెడ్డి రూ.1.41 లక్షలకు, వెండి వినాయక విగ్రహం బైరెడ్డి వెంకటసుబ్బారెడ్డి రూ.1.21 లక్షలకు, వెండి కలశం చెంబును మణ్యంరాజేశ్వరి రూ.93 వేలకు, వెండి ప్లేట్లు సిద్దమూర్తి రామకృష్ణారెడ్డి రూ.51 వేలకు, వెండి దీపారాధనలు సి.తిరుపాల్‌రెడ్డి రూ.23 వేలకు, వెండి కుంకుమభరిణను కొల్లుసుబ్బారెడ్డి రూ.20 వేలకు, వెండి పూలు శివకిశోర్ రూ.30 వేలకు, వెండి గంట డి.రాజారెడ్డి రూ.22 వేలు, వెండి ఉంగరం ఎం.నాగసుబ్బారెడ్డి రూ.15 వేలకు, వెండి ఉద్ధరిణి జమ్మనకృష్ణారెడ్డి రూ.16 వేలు, వెండి వినాయక డాలర్‌ను బైరెడ్డి వెంకటసుబ్బారెడ్డి రూ.10 వేలకు సొంతం చేసుకున్నారు. నిర్వాహకులు వారిని సన్మానించారు.

ఘనంగా గణేష నిమజ్జనం

చాపాడు : వినాయన చవితి పురస్కరించకుని గ్రామాలు, పట్టణాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలకు వారం రోజులుగా నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. చాపాడు మండలంలోని పలు గ్రామాలతో పాటు ప్రొద్దుటూరు, మైదుకూరు పట్టణాల్లో కొలువుదీరిన వినాయన విగ్రహాలను మండలంలోని సీతారామాపురం, అన్నవరం గ్రామాల వద్ద గల కుందూనదిలో ఆదివారం నిమజ్జనం చేశారు. నిమజ్జనం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

రూ.89వేలు పలికిన వినాయకుడి లడ్డూ

మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గణేష ఉత్సవాల 21వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడి సన్నిధిలోని లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలంలో నాయీ బ్రాహ్మణులైన శివయ్య సుబ్రమణ్యం కుమారులు వెంకటసుబ్బయ్య(బుడ్డబ్బి), సురేష్‌లు రూ.89వేలకు వేలం పాడి లడ్డూను దక్కించుకున్నారు. భక్తులకు స్వామి ప్రసాదం పంపిణీ చేశారు.



చియ్యపాడులో వేలంలో లడ్డూను దక్కించుకున్న వెంకటసుబ్బయ్య, సురేష్



మిట్టమడి వీధిలో ముగ్గుల పోటీలు



మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డిని సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



రాజుపాళెం: గణేష్ లడ్డు, కలశం చెంబు, డాలర్ దక్కించుకున్న వారితో కమిటీ సభ్యులు, భక్తులు



నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహం

ఇంకా ఎంత మంది ఎస్సీ అభ్యర్థులు బలి కావాలి

టీడీపీ ఇన్‌చార్జి విజయమ్మకు ఎమ్మార్పీఎస్ సూటి ప్రశ్న

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి విజయమ్మ చేతిలో ఇంకా ఎంత మంది ఎస్సీ అభ్యర్థులు బలి కావాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.ప్రసాద్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నిర్వహించిన బద్వేలు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2009లో లక్కినేని అమృతకుమార్, 2014లో ఎన్.డి.విజయజ్యోతి, 2019లో డాక్టర్ ఓబుళాపురం రాజశేఖర్‌లకు టిక్కెట్ ఇచ్చినప్పటికీ ఎవరు ఓడించారనే విషయాలు బద్వేలు నియోజకవర్గ మేధావులకు, ప్రజలకు తెలిసిన విషయమే అని అన్నారు. అభ్యర్థులను మార్చుకుంటూ పోతూ రాజకీయంగా దళితులు నిలదొక్కుకోకుండా చేస్తున్నారని తెలిపారు. దళితుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు, స్వార్థపూరిత నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, డాక్టర్ రాజశేఖర్‌కు మరొక అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కథల పోటీలు



కథ చెబుతున్న విద్యార్థి

పోరుమామిళ్ల : స్థానిక గ్రంథాలయంలో ఆదివారం జేవీవీ జిల్లా కార్యవర్గసభ్యులు ఖాశింవలి, గ్రంథాలయ అధికారి అఫ్రిది ఆధ్వర్యంలో విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఖాశింవలి మాట్లాడుతూ ప్రతి ఆదివారం వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తామన్నారు. విద్యార్థులు గ్రంథాలయంలోని విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదవాలన్నారు. కథల పుస్తకాలు, జీవితచరిత్రలు, జనరల్ నాలెడ్జి, చరిత్ర పుస్తకాలు చదవటం వల్ల ప్రపంచం గురించిన అవగాహన కలుగుతుందన్నారు. పెద్దవారందరూ పుస్తకాలు చదవటం వల్లనే జ్ఞానం సంపాదించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, పండ్లు అందజేత



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

చాపాడు: మండల పరిధిలోని పల్లవోలు సమీపంలోని కాశినాయన వృద్ధాశ్రమంలో ఆదివారం ప్రొద్దుటూరుకు చెందిన సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. జమ్మలమడుగు మండలం సుగుమంచిపల్లెకు చెందిన ఒంటెద్దు రామసుబ్బారెడ్డి వర్ధంతిరి పురస్కరించుకుని వారి కుటుంబీకులు సేవా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం ప్రతి మనిషి జీవితంలో తప్పనిసరి అన్నారు. ఈ క్రమంలో అందరూ ఉన్న అభాగ్యులుగా ఆశ్రమాల్లో ఉంటున్న వారికి తమవంతు చేయూతగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ



కృత్రిమ అవయవాలు అమర్చుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వెంకటేశ్వర్లపేట సరస్వతి విద్యా మందిరంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం 70 మందికి కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, హుబ్లీలోని ఆల్ ఇండియా జైన్ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను అందించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా చైర్ పర్సన్ కళావతి, గౌరవాధ్యక్షుడు సన్నుతి శ్రీనివాసులు, అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, ప్రకాష్, రమేష్, సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 23, 24వతేదీలలో సాహిత్య సభలు

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 23, 24వ తేదీలలో మహా సభలు నిర్వహించనున్నట్లు అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తెలిపారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం వైయస్ఆర్ జిల్లా రచయితల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహా సభల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. తొలి రోజు కార్యక్రమంలో ప్రాచీన సాహిత్యం, కవిత, కథానిక, నవల, నాటకం ప్రక్రియలపై సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భువన విజయం నాటక ప్రదర్శన, రెండవరోజు కార్యక్రమంలో అవధానం, హాస్యావధానం, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో సంఘంలోని సీనియర్ సాహితీవేత్తలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, భూమిరెడ్డి స్వరూపరాణి, డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, డాక్టర్ జి.వి.సాయిప్రసాద్, డాక్టర్ అనుగూరు చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి నేతలు జీవన్ చంద్రశేఖర్, కృష్ణకుమార్ కోరారు. జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా స్థాయి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి తక్కువ వేతనానికి సమయపాలన లేకుండా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జేఏసీని బలోపేతం చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కార్యక్రమంలో తులసీనాథ్, పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎంపిక

కడప జిల్లా ఒప్పంద మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా తులసీనాథ్(గృహ నిర్మాణ శాఖ), ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్ (సాంఘిక సంక్షేమ శాఖ), అసోసియేట్ చైర్మన్‌గా గణేష్ (హార్టికల్చర్), కో చైర్మన్‌గా వరపుత్ర (మెడికల్ డిపార్టుమెంట్)లను ఎన్నుకున్నారు.

ఉధృతంగా ప్రవహించిన వాగులు, వంకలు

పెండ్లిమర్రి: మండలంలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కుంటలు, చెరువులు జలకళలను సంతరించుకున్నాయి. సాగులో ఉన్న చామంతి, అరటి పత్తి, వరి పంటలకు ఊరట లభించిందని రైతున్నలు తెలిపారు. ఉల్లి రైతులు కొందరు నష్టపోయిరు. తిప్పరాజుపల్లె గ్రామానికి వెళ్లె దారిలో వాగు ఉధృతంగా ప్రవహించింది. వాగులో ట్రాక్టర్, అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు కూలీలు చిక్కుకున్నారు. స్థానికులు గమనించి కూలీలను, ట్రాక్టర్‌ను బయటకు తీశారు.

ఏపీ ఎస్టీఎఫ్ నాయకుల నిరసన

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీపీఎస్ బిల్లును ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పాత ఫింఛన్ అమలు కోరుకుంటున్నారని ఏపీ ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. కడప కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో ఆదివారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, చత్తీస్గఢ్ రాష్ట్రాలు ఓపీఎస్‌ను అమలు చేస్తున్నాయన్నారు.

మొల్లమాంబ శతకం ఆవిష్కరణ

కడప కల్చరల్: మహా కవయిత్రి మొల్లమాంబ ఖ్యాతి మహిళా లోకానికి ఆదర్శమని విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు అన్నారు. మొల్ల సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లోని మొల్లమాంబ విగ్రహం వద్ద రచయిత మామిళ్ల లోకనాథం రచించిన శతకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొల్లమాంబ జయంతిని ఏటా మార్చి 13న రాష్ట్ర ప్రభుత్వం పండుగగా నిర్ణయించడంతో ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం గానుగపెంట హనుమంతరావును సాహితీ వేత్తలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, స్వర్ణలత, వై సంజీవరాయుడు, రారాజు, కాల్వ సోము కళానాథరెడ్డి, పార్వతమ్మ, శివశంకర్, కొండారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కురిసింది..



పచ్చగా ఉన్న మొక్కజొన్న పంట

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున వర్షం కురిసింది. గత 12 రోజులుగా చినుకు జాడ లేకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. ఆదివారం జోరున వర్షం కురవడంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పత్తి, పసుపు, కంది, అరటి, వరి, మినుము, మిరప, మొక్కజొన్న పంటలకు జీవం వచ్చిందని రైతులు చెబుతున్నారు.

పంట నమోదు చేయించుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలో ఇప్పటి వరకు 2 వేల ఎకరాలలో ఈ క్రాపు పంట నమోదు జరిగిందని మిగిలిన రైతులు కూడా ఈనెలాఖరులోగా పంటన మోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అదివారం ఆయన మండలంలో సాగు చేసిన పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 2200 ఎకరాలలో వ్యవసాయ పంటలను సాగు చేశారు. అందులో 800 ఎకరాలలో పత్తి, 900 ఎకరాలలో వరి, చీనిచెట్లు 900 ఎకరాలలో, మిగిలిన ఎకరాలలో ఇతర పంటలను రైతులు సాగు చేశారన్నారు. ఈ నెలఖారులోగా ప్రతి రైతు వారి సాగు చేసిన పంటను ఈ క్రాప్ చేసుకోవాలన్నారు.

11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున డిమాండ్ చేశారు. కడప ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ డీఏలను చెల్లించలేదన్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులో జాప్యం ఉందని, సంపాదిత సెలవులు నగదు రూపేణా తీసుకోవడానికి పెట్టిన బిల్లులు ఇవ్వలేదన్నారు. బదిలీల ద్వారా వెళ్లిన ఉపాధ్యాయులకు మ్యాపింగ్ గాక జూన్ నుంచి ఇంతవరకు జీతాలు అందలేదన్నారు. పలు మార్లు సమాచారం అందించినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సుదర్శన్‌బాబు, గంగరాజు, కార్యదర్శులు గంగాధర్ పాల్గొన్నారు.